సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు ఎంవీవీ నామినేషన్



ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంవీవీ సత్యనారాయణ బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఇందు కోసం ఉదయం 8 గంటలకు ఆరిలోవ కాలనీ నుంచి ర్యాలీగా బయలుదేరనున్నారు. హనుమంతవాక, విశాలాక్షినగర్, అప్పుఘర్, మహాత్మగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డు, ఎంవీపీ డబుల్ రోడ్డు, ఉషోదయ జంక్షన్, విశాఖ కంటి ఆస్పత్రి, పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఆలయం, సిరిపురం జంక్షన్, సెవెన్ హిల్స్ ఆస్పత్రి, జగదాంబ జంక్షన్ మీదుగా కలెక్టరేట్ సమీపం వరకు ఈ ర్యాలీ సాగనుంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంవీవీ కోరారు.

22వ వార్డులో ఇంటింటి ప్రచారం



వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: ఐదేళ్ల పాటు ప్రజాపాలన అందించిన వైఎస్సార్‌సీపీకి మద్దతుగా పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ మంగళవారం 22వ వార్డు పిఠాపురం కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను చేరువ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణతో పాటు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో రెండు నామినేషన్ల దాఖలు



జేసీ మయూర్‌అశోక్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి సురేష్

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా అనగాని శివరామకృష్ణ, మాతే సురేష్ తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్‌అశోక్‌కు కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు.

ఏపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా కాకర్ల

ఆరిలోవ: ఏపీసీసీ క్రిస్టియన్ మైనార్టీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా జోసఫ్ కాకర్ల నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ శాలి దాదా గాంధీ నియామక పత్రాన్ని జారీ చేశారని కాకర్ల ఒక ప్రకటనలో తెలిపారు. తనకు వైస్ చైర్మన్‌గా నియమించినందుకు శాలి దాదా గాంధీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో తులసికి డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని కె.తులసికి డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్‌యూజ్ ఆఫ్ పాస్ఫోజిప్సం న్యూట్రలైజ్డ్ బై లైమ్ మిక్స్‌డ్ సెలక్టెడ్ ఆల్కలీ ఇండస్ట్రియల్ బై ప్రొడక్ట్స్ అండ్ జియో జింథటిక్ క్లే లైనర్ ఇన్ కాంపోజిట్ బేస్ లైనింగ్ సిస్టం ఆఫ్ పాస్ఫోజిప్సం పాండ్స్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ఆమె స్వీకరించారు. ఎరువులు తయారీ పరిశ్రమల్లో బై ప్రొడక్ట్‌గా వచ్చే పాస్ఫోజిప్సంను నేల కలుషితం కాకుండా పరిశ్రమలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ నిల్వ చేసే విధానంపై ఆమె పరిశోధన చేశారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సీఎం జగన్‌తో ఆత్మీయ భేటీ





మేము సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఎండాడలో బస చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ నాయకుడు జి.వెంకటేశ్వరరావు(జీవీ), పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు

- వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 28వ వార్డులో 'మేము సిద్ధం' సభ



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: రాబోయే ఐదేళ్ల రాష్ట్రంతో పాటు పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వైఎస్సార్‌సీపీకి మరోసారి ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్‌లో మేము సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో 28వ వార్డులో డ్రైనేజీలు, రోడ్లు, సామాజిక భవనాల నిర్మాణాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. కులమతాలు, పార్టీలకతీతతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేద ప్రజల గురించి ఏ ఒక్కరోజు కూడా చంద్రబాబు ఆలోచన చేయలేదన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పెత్తందార్లతో యుద్ధానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలన్నారు. చంద్రబాబు తన తోక పార్టీ జనసేన, పచ్చ మీడియాతో కలిసి అధికారంలోకి రావడం కోసం కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. వలంటీర్లతో ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే రూ.3 వేలు పెన్షన్ అందించామన్నారు. 58 నెలల కాలంలో 2.31 లక్షల ఉద్యోగాలు, 31 లక్షల ఇళ్ల పట్టాలు పేదింటి మహిళలకు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ సర్కారుకు దక్కుతుందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో మూడు సార్లు గెలిచిన వెలగపూడి తన మద్యం షాపుల వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నారు తప్ప, నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. పార్టీలకు అతీతంగా గడిచిన ఐదేళ్లలో తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, జి.వి.రామచంద్రరావు, పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ అమ్మవారి జాతర



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పోలమాంబ అమ్మవారి ఆలయం



విశేష అలంకరణలో పోలమాంబ అమ్మవారు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెదవాల్తేరులోని ప్రధాన ఆలయంలో అమ్మవారిని వేలాది మంది దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ ఈవో గాయత్రి సిబ్బంది సహకారంతో చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, ఎండ తగలకుండా టెంట్‌లు వేశారు. మంచినీరు, మజ్జిగ, పాలు వంటివి పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని సైతం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష పర్యవేక్షించారు. ఈ నెల 14న అమ్మవారి పండగ ప్రారంభమై పుట్టబంగారం తేవడం, అమ్మవారిని ప్రధాన ఆలయం నంచి పెదవాల్తేర్ మద్దివారి పెద్దింటికి తీసుకురావడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పండగలో భాగంగా ఘటాలు, నేలవేషాలు, పులివేషాలు, గరిడీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, రథాలు, గుర్రాల జాతరతో సందడి చేశారు. సాయంత్రం చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయానికి వెళ్లే రహదారి జన సంద్రంగా మారిపోయింది. రహదారి పక్కనే ఏర్పాటు చేసిన దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేస్తూ చిన్నారులు సందడి చేశారు.

పుస్తక పఠనాసక్తి అవసరం



ఎస్ఆర్ రంగనాథన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: యువతలో పుస్తక పఠనాసక్తిని పెంచాల్సిన అవసరం ఉందని ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం గౌరవ అధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని గ్రంథాలయంలో నిర్వహించారు. భారతీయ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాలకు ఈ సందర్భంగా పూలమాలలు వేశారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తక జ్ఞానం వ్యక్తి వికాసానికి, ఉన్నతికి దోహదపడుతుందన్నారు. పుస్తకాలు చారిత్రక ఆధారాలుగా, సాక్ష్యాలుగా మనకు నిలుస్తున్నాయన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందినా పుస్తకం ప్రాధాన్యత తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన 'పది' విద్యార్థులకు సత్కారం



పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: చినగదిలి మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఈవోలు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఒక ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 12 మంది విద్యార్థులను సత్కరించారు. వారిలో అడవివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.సోమశేఖర్ 585/600 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా సోమశేఖర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. తోటగరువు హైస్కూల్ రత్నసావియా(584/600), చంద్రంపాలెం హైస్కూల్ నవ్య(584/600), అడవివరం హైస్కూల్ శ్రావణి(581/600), ఎండాడ హైస్కూల్ శిరీష్(548/600), ఎస్ఎస్ కాలనీ హైస్కూల్ సహిత(545/600), వాడపాలెం హైస్కూల్ జ్యూష్మిక(538/600), ఏపీ గురుకులాల్లో కొమ్మాది గురుకులం అమృత వర్షిణి(572/600), మారికవలస బాలుర గురుకులం రమేష్(555/600), మారికవలస బాలికల గురుకులం కావ్యశ్రీ(546/600), శ్రీకృష్ణాపురం గురుకులం జయవర్ధన్(529/600)తో పాటు ప్రభుత్వ బాలికల అంధ స్కూల్ పుష్ప(340) మార్కులు సాధించారు. వారిని చినగదిలి మండలం ఎంఈవోలు సీహెచ్.వీరేంద్రబాబు, డి.అనురాధ అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు, విద్యార్థులకు సౌకర్యాలు అందుబాటులో ఉండటమే ఉత్తమ ఫలితాలు సాధ్యమైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తోటగరువు హైస్కూల్ హెచ్ఎం జి.కె.డి.భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 10వ వార్డు టీడీపీ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన 50 మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం 10వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కేఆర్‌పీ ప్రసాద్ ఆధ్వర్యంలో వారికి లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలన, అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ 10వ వార్డులో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పతివాడ కనకరాజు, పతివాడ వెంకటలక్ష్మి, ఎస్.కె.సైదాబీ, అప్పల నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ ప్రాంతంలో ప్రత్యేక పూజలు



చినగదిలి పోలమాంబ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



చినగదిలిలో ప్రత్యేక అలంకరణలో పోలమాంబ అమ్మవారు



సంజయ్‌గాంధీ కాలనీ పోలమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పలు చోట్ల కొలువైన పోలమాంబ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్, దీన్‌దయాల్‌పురం, చినగదిలి, సూర్యతేజానగర్, పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాలను కమిటీ సభ్యులు పచ్చని పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం సంబరాలు చేశారు. ఆలయాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చినగదిలి పోలమాంబ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. చినగదిలి, సంతపాలెం ప్రాంతాల నుంచి మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారికి మధ్యాహ్నం అన్నదానం చేశారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గొలగాని శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి సంజయ్‌గాంధీ కాలనీ, చినగదిలి, పెదగదిలి ప్రాంతాలలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, 12, 13 వార్డుల కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్ల సునీత పలు ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు.

నారాయణరావు సేవలు నిరుపమానం



నారాయణరావు, హనితను సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పర్యవేక్షకుడిగా పని చేస్తూ పదోన్నతిపై ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా వెళ్లిన వై.నారాయణరావుకు, సివిల్ సర్వీసెస్‌లో 887 ర్యాంకు సాధించిన వేములపాటి హనితకు మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నారాయణరావు సేవలను కొనియాడారు. 2011 నుంచి ఆయనతో తనకు పరిచయం ఉందని, ఇలాంటి వ్యక్తి డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఎంతో అవసరమన్నారు. కార్యాలయంలో శిక్షణ పొందుతున్న వేములపాటి హనిత సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకు సాధించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆమె త్వరలో కలెక్టర్‌గా విశాఖ జిల్లాకే వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో సుమతి, జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ పి.పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, దుర్గాప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

ఆరిలోవ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గణితం ఎంతగానో దోహదపడుతుందని, దానిపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులుగా కళాశాలలో ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ పేరిట నిర్వహించిన కార్యక్రమానికి జోన్-1 పరిధిలోని గణితం అధ్యాపకులు 36 మంది, రిసోర్స్ పర్సన్‌లు నలుగురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సదస్సులను సద్వినియోగం చేసుకుని అధ్యాపకులు, విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకునేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

- ఇనుకకొండకు పోటెత్తిన భక్తులు



రమా సహిత సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. చైత్ర పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలి వచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ధ్వజస్తంభం చుట్టు భక్తులు ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. ఎండ తీవ్రత దృష్ట్యా దేవస్థానం మంచినీటిని అందజేసింది, ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

యాతలకు అండగా నిలిచింది సీఎం జగనే



నూకరాజు, సుజాతలను సత్కరిస్తున్న యాత కులస్తులు

తాటిచెట్లపాలెం : యాత కులస్తులకు అండగా నిలిచింది జగన్‌మోహనరెడ్డి మాత్రమేనని ఉత్తరాంధ్ర యాత సాంస్కృతిక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు తెలిపారు. నరసింహనగర్‌లో గల ఆయన నివాసంలో ఉత్తర నియోజకవర్గ యాత కుల అధ్యక్షులు, ముఖ్య నాయకులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ నాయకుడు, ప్రభుత్వాలు చేయని సంక్షేమం ఈ ప్రభుత్వ హయాంలో కల్లుగీత వృత్తిదారులకు జరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహనరెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ఫలాలు అన్ని వర్గాల వారికి అందుతున్నాయన్నారు. యాతలను బీసీ-ఏగా మార్చేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్ని విధాల ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అదే విధంగా యాత కులస్తులందరూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు తమ ఓట్లు వేసి ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యాత కులస్తులకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ఏడాదికి సుమారు రూ. 45 కోట్లు ప్రభుత్వం అందజేస్తుందని సమావేశానికి హాజరైన ఏపీ యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత తెలిపారు. తమ జాతి సంక్షేమం కోసం సహకరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పిల్లి నూకరాజు, పిల్లి సుజాతలను ఉత్తర నియోజకవర్గ యాత కులస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం ఉత్తర నియోజకవర్గం అధ్యక్షుడు సిమ్మ గోవింద, సంఘం కార్యవర్గ సభ్యులు గొడ్డు కన్నారావు, బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, కార్యదర్శి భాస్కరరావు, పిల్లి చిన్నారావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

WANTED TEACHERS
1) ENGLISH : 8th to 10th
2) HINDI : 8th to 10th
3) COMPUTERS : 1st to 8th
Qualified & experienced;
GOOD SALARY
WONWORLD SCHOOL
4-47-7, Lawsonsbay Colony, Pedawaltair,
VSP-17. CELL: 9393003003 / 9392001001

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
9010133346
Office mail : sakshiadvtvsp@gmail.com